# అంతటా ఉన్నది ఆత్మతత్త్వమే

**విమల భావంబు గలుగుటే విద్యయగును**
**సరసగుణములు కలుగుటే చదువులగును**
**సహజ భావము కలుగుటే సరసమగును**
**మంచి నడతలు ఉండుటే మానవుండు**
**గాలిలోన జ్యోతి కదలాడు చుండును**
**గాలి లేనిచోట కదలకుండు**
**ఆశయనెడు గాలి నణగద్రొక్కినయంత**
**మంచిదౌను మనసు మరుగు విడిచి.**

**విద్యార్థులారా!**

విశాలమైన సముద్రము అసంఖ్యాకములైన అలలు వెదజల్లుతూ ఉంటుంది. ఒక్కొక్క తరంగము ఒక్కొక్క రూపనామమునుకూడి వివిధ భేదములచే భిన్న భిన్న రూపములచే కనుపించుతూ ఉంటాది. కానీ ఈ అన్నీకూడను సముద్రమునకు భిన్నమైనవి కావు. అటులనే జగత్తునందుగల అసంఖ్యాకములైన జీవరాసులు వివిధ రూపనామములచే జీవించుచుండినప్పటికిని ఇవి అన్నీ ఒక అఖండ సచ్చిదానంద సాగరమునందుగల బిందువులే. సమస్త మానవులు, సమస్త జీవులు కూడను దివ్యత్వముతో కూడిన పవిత్రస్వరూపములే. 'ఆత్మవత్ సర్వభూతాని' ఇది భారతీయ శాస్త్రముల ప్రధానమైన ప్రబోధ. భారతీయ పవిత్ర శాస్త్రములు సమస్త జీవులయందు అట్టి దివ్యత్వమైన తత్త్వము ఆత్మస్వరూపమై ఉన్నదనే సత్యాన్ని ప్రబోధిస్తూ వచ్చాయి. ఈ దివ్యత్వమును అనేక రూపములుగా దర్శించినప్పటికిని ఇందులో ఉండిన ఏకత్వము ఆత్మతత్త్వమనేది చక్కగా వివరింపబడుతుంది.

**మృత్పిండమేకం బహుభాండ రూపం**
**గోక్షీరమేకం బహు ధేను జాతం**
**సువర్ణమేకం బహుభూషణాని**

srisathyasaivachanamrutam

## తేది. 02-07-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

### ఏకం పరాత్మా బహుదేహవర్తీ

మట్టి ఒక్కటే అయినప్పటికి కుండలు అనేకంగా రూపొందుతాయి. సువర్ణము ఒక్కటే అయినప్పటికి అనేక రూపనామములు ధరించిన నగలుగా తయారౌతాయి. గోవులు వేరువేరుగా ఉండినప్పటికిని క్షీరముయొక్క రంగు ఒక్కటిగానే ఉంటుండాది. దైవముకూడా ఒక్కడే అయినప్పటికిని అనేక రూపనామములతో ప్రత్యక్షమౌతుంటాడు.

విద్యార్థులారా! మన ఇంద్రియములు ఆత్మకానేరవు. ఇంద్రియములు స్మరించవచ్చును. గోచరించవచ్చును. ఆత్మ ఇంద్రియములన్నింటికంటే వేరుగనే ఉంటుంది. ఆత్మకు ఈ ఇంద్రియములకు ఎట్టి సంబంధము లేదు. చూపుకేవలము ఆత్మ సంబంధమైనది. చర్మ చక్షువు మాత్రమే ఒక ఇంద్రియముగా రూపొందుతుంది. ఈ కంటికి రంగుకు మధ్యలో ఉండిన దివ్యతత్త్వమే ఈ ఆత్మతత్త్వము. కర్ణము, శబ్దమునకు మధ్య ఉండిన దివ్యత్వమే ఆత్మతత్త్వము. కన్నులుండి కూడను రంగు చూడలేకపోవచ్చును. నిజముగా ఇంద్రియమే సత్యమైయుండిన కన్ను రంగును ఎందుకు చూడకూడదు. కాదు. కంటికి రంగుకు మధ్యలోపల దివ్యత్వమైన అపురూపమైన కాంతి ఉంటుండాది. కన్నుకు కేవలము చూసే శక్తి మాత్రమే ఉన్నది. చెవికి వినేశక్తి మాత్రమే ఉన్నది. కన్నుకు చూచే శక్తి మాత్రమే ఉన్నది. నాలుక రుచిమాత్రమే చూడగలదు. కానీ సర్వమును ఇంద్రియములు చేయించలేవు. కన్ను చూడగలదేగాని వినగలదా? చెవి వినగలదేగాని చూడగలదా? లేదు. కనుక ఒక్కొక్క ఇంద్రియమునకు ఒక్కొక్క విధమైన శక్తి మాత్రమే చేకూర్చబడింది. సమస్త శక్తులతో కూడిన దివ్యత్వము ఆత్మ ఒక్కటి మాత్రమే.

### ఆత్మవత్ సర్వభూతాని

అనేక పాత్రలయందు అనేక విధములైన బింబములు మనకు కనుపించవచ్చు. దీనిని ఘటాకాశం, పటాకాశం, మఠాకాశం అంటారు. ఘటమునందు నీళ్ళలో ఆకాశము కనుపిస్తూ ఉంటుండాది. ఎంతవరకు ఘటమునందు ఆకాశము కనుపిస్తుంది? ఘటము ఉపాధిగా ఉండినంతవరకు మాత్రమే ఆకాశము ఈ ఘటములో కనుపిస్తుంది. ఘటము శిథిలమైనప్పుడు ఆకాశము కనుపించదు. అయితే ఆకాశము ఎక్కడ పోయింది? స్వస్వరూపములోనే ఉంటుండాది. ఆకాశము ఈ ఘటంలో రాలేదు. ఘటం పగిలిపోతూనే పోలేదు. ఘటములో

sri sathyasaivachanamrutam

జలము ఉండినంతవరకు ఇది కనుపించుతూ వచ్చింది. ఘటము శిథిలము కాగానే జలము కారిపోతుంది. దానిలోపల ఆకాశము కనుపించలేదు. అదేవిధముగనే దేహమొక ఘటము. ఈ దేహమనే ఘటములోపల మనస్సనే జలము. ఇందులో ఆత్మ తత్త్వమనే ఆకాశము ప్రతిబింబిస్తూ ఉండాలి. అయితే ఈ ఘటము ఉండినంతవరకు ఇందులో కనుపిస్తూ ఉంటుండాది. ఘటము శిథిలమైన తరువాతకూడను ఉన్నది. కానీ కనుపించదు. కనుపించక పోయినతమాత్రమున లేదని వాదించరాదు. కనుకనే 'ఆత్మవత్ సర్వభూతాని' అన్నింటియందు, అంతటా, అన్ని కాలములయందు ఉన్నది అదొక్కటే సత్యము. పటాకాశమన్నారు. పటమునందు పెయింట్ లోపల ఒక ఆకాశాన్ని నిరూపిస్తారు. కానీ ఆ పిక్చరును మనం చించివేసినప్పుడు ఆకాశం పోవటం లేదు. నీవు పేపరు చించివేశావు. కానీ ఆకాశాన్ని చించివేయలేదు. అదేవిధముగనే ఘటాకాశం, పటాకాశం, మఠాకాశం అని వేదాంతమునందు మూడు ఆకాశతత్త్వములు నిరూపిస్తూ వచ్చారు.

ఆత్మ అఖండమైనది. దీనికే సత్యం శివం సుందరం అని పేర్లు పెట్టారు. వ్యావహారిక రూపంగా పదములు వేరువేరుగా కనుపిస్తున్నవి కాని స్వస్వరూపతః మూడు ఒక్కటే. శివం లేక సత్యము లేదు. సత్యం లేక సుందరం లేదు. సుందరం ప్రకాశింప జేస్తుంది. సత్యం స్వరూపాన్ని దర్శింప చేస్తుంది. తద్వారా పదార్థములు ప్రకాశింపచేస్తుంది శివం. మూడింటి ఏకత్వము దివ్యత్వమైన తత్త్వమే. అనేక పర్యాయములు చెప్పాను. ఇది ఒక వస్త్రము. ఈ వస్త్రమున కాధారమేమిటి? దారము. ఈ దారమున కాధారమేమిటి? ప్రత్తి, ప్రత్తి దారముగా తయారయింది. దారమే వస్త్రంగా తయారయింది. ఈ మూడింటి ఏకత్వము ఒక్కటే.

అదే రీతిగా సత్యమనేది శివమనే రూపమును ధరించి శివతత్త్వము లోపల సుందర రూపాన్ని ధరిస్తుండాది. సత్యం శివం సుందరమనగా మూడు వేరు పర్యాయ పదములేగాని పదార్థతత్త్వము ఒక్కటే. అదేవిధముగనే ప్రేమ సౌందర్యము, మాధుర్యము, శోభ. మన తొమ్మిదవక్లాసు విద్యార్థి చెప్పాడు. ప్రేమ సౌందర్యము, మాధుర్యము, శోభ అని. పదములందు మాత్రమే భేదము కనుపిస్తుండాదిగాని నాలుగు కూడను ఒక్క పదార్థముయొక్క పర్యాయ పదములే. హృదయము కరిగినప్పుడు ప్రేమగా ప్రవహిస్తుంది. ప్రేమ ముదిరినప్పుడు

srisathyasaivacharamrutam

సౌందర్యమేర్పడుతుంది. ఈ సౌందర్యముయొక్క వృష్టి మాధుర్యములో మత్తైపోయినప్పుడు అదే మధురంగా మారిపోతుంది. అనగా దీనియొక్క నిజతత్త్వాన్ని అనుభవించిన తర్వాత అదే మాధుర్యంగా మారిపోతుంది. ఈ మాధుర్యమైన స్థితియందే సర్వము శోభాయమానంగా వర్థిల్లుతుంది. మొదలు పుష్పము, ఈ పుష్పములో క్రమక్రమేణా రేకులు రాలిపోయినప్పుడు ఒక పిందెలా తయారౌతుంది. ఈ పిందెను మనం కాపాడుతూ పోయేటప్పటికి యిది ఒక కాయగా మారుతుంది. ఈ కాయ కొంతకాలమైనాక పండు అవుతుంది. పుష్పము, పిందె, కాయ, ఫలము నాలుగు ఒక్కటే. అయితే ఈ కాయలో ఉన్న మాధుర్యమునకు, ఫలములో ఉన్న మాధుర్యమునకు చాలావ్యత్యాసము ఉంది. కాయ వగరుగా ఉండవచ్చును. పరిపక్వస్థితికి వచ్చేముందు కొంచెం పులుపుగా ఉండవచ్చు. పండుగా రూపొందిన తర్వాత మాధుర్యంగా మారుతుంది. అయితే ఈ మాధుర్యము ఎక్కడనుండి వచ్చింది? వగరు నుండే వచ్చింది ఈ మాధుర్యం. అదే విధముగా మనప్రేమ తత్త్వమును హృదయాన్ని కరిగించే రీతిగా మార్చుకున్నప్పుడు అది ఒక సౌందర్యముగా రూపొందుతుంది. ఈ సౌందర్యతత్త్వాన్ని రుచి చూసినప్పుడు మాధుర్యంగా రూపొందుతుంది. ఈ మాధుర్యతత్త్వమే నిజమైన ఆత్మతత్త్వము కనుక ఇది నిరంతరము కూడా మాధుర్యమే.

**నయనం మధురం వచనం మధురం**
**సర్వం మధురం మధురాధిపతే రఖిలం మధురం**

అంతా మధురమే. ఈ మధురం చేతనే జగత్తంతా శోభాయమానంగా రాణిస్తోంది. కనుకనే సౌందర్యమనిగాని, ఆనందమనిగాని, మాధుర్యమనిగాని బయటి ప్రపంచమునందుగల పదార్థములందు కానరాదు. ఇవన్నీ మనయందే ఉంటున్నాయి.

మన మనస్సుయొక్క తత్త్వమును దైవము వైపుకు మరల్చినప్పుడే అన్ని రూపములను ధరిస్తుంది. అంతేగాని మనస్సు మార్పు కలుగక ప్రాకృతమైన ఇవి ఎన్ని మారినప్పటికిని ప్రయోజనం లేదు. వ్యక్తి పరిణామమే విశ్వపరిణామము. మనిషి మారక విశ్వము మారదు. విశ్వమనగా మనకు కనుపించే భూమి మాత్రమే కాదు. మనతో సంభాషించే సమాజమే మన విశ్వము. మనకంటికి కనిపించే సమాజమే మన విశ్వము. సమాజమనగా

చైతన్యవంతమైనదేగాని జడమైనది కాదు. మనిషి మనస్సు మారినప్పుడే సమాజముకూడను మారుతుంది. ఈనాడు లౌకిక పరిణామము, ఆర్థిక పరిణామము విజ్ఞాన పరిణామము, రాజకీయ పరిణామము ఇవన్నీ జరుగుతున్నవికాని మానసిక పరిణామము జరగటం లేదు. మానసిక పరిణామము జరగాలంటే ఆధ్యాత్మిక పరిణామము అత్యవసరము. ఆధ్యాత్మిక పరిణామమునందే మానసిక పరిణామము ఇమిడి ఉంటుండాది.

**మంచి భావముల వల్లనే మంచి వాతావరణము**

విద్యార్థులారా! ఈ ఆధ్యాత్మిక పరిణామము అత్యవసరమైనది. ఒక చిన్న ఉదాహరణము. కర్షకులుగాని, కార్మికులుగాని, వ్యాపారులుగాని, రాజకీయ వేత్తలుగాని, అధికారులుగాని వీరందరుకూడను కలసిమెలసి ప్రకృతియొక్క శాంతిని కోరినప్పుడు ప్రకృతిలో ఒక విధమైన సుఖము భద్రత ఏర్పడుతుంది. ప్రాచీనకాలము నుండి వీరందరి సమ్మిళితమైన స్వరూపముచేతనే దేశమునందు సుభిక్షత ఏర్పడుతూ వచ్చింది. వీరి అందరికంటె మహర్షుల ఉత్సాహ ప్రోత్సాహములు లోకకళ్యాణమునకు ఎంతయో శోభను కలిగించినవి. వారి ఆధ్యాత్మిక శక్తి సామర్థ్యముల చేతనే సకాలములో వర్షములు కురవటం ఆహార పదార్థములు అభివృద్ధి కావటం, లోకములో సుభిక్షము తాండవమాడటం, తిండి తీర్థాదులకు కొరతలు లేకుండా జీవించటం జరుగుతూ వచ్చింది. ఆనాడు ఎట్టి ప్రోజెక్టులు లేవు. ఎట్టిడాములు కట్టలేదు. వాటితో వారికి అవసరమే లేకపోయింది. కారణమేమనగా వారి సద్భావములు, పవిత్రమైన నడతలు తద్వారా సకాలములో వర్షములు కురుస్తూ వచ్చాయి.

దేశముయొక్క సౌభాగ్యముగాని ప్రకృతియొక్క అదృష్టము గాని యువతీయువకుల నడతలపైన ఆధారపడి ఉంటుండాది. మంచి నడతలు కల్గి ఉండినప్పుడే మంచి జీవితాన్ని అనుభవించటానికి వీలవుతుంది. ఆనాటి యువతీ యువకులు పవిత్రమైన నడతల చేతనే ప్రకృతిని శోభాయమానముగా తీర్చిదిద్దారు. ఈనాడు ఇన్ని ప్రాజెక్టులంతా అభివృద్ధి పరుస్తున్నారు. ఇన్ని డాములు కడుతున్నారు. కోట్లకొలది ధనము ఖర్చుపెడుతున్నారు. కానీ అన్నపానాదులు లేక ప్రజలు అనేక విధముల బాధలకు గురౌతున్నారు. కారణమేమిటి? ఇన్ని విధములైన అనుకూలములు చేసినప్పటికిని ప్రజలలో సుఖశాంతులు లేకపోవటానికి

sri sathyasai vachanamrutam

కారణమేమిటి? సరియైన నడతలు లేకపోవటమే. నీతి నిజాయితీలు కోల్పోవటమే. మానవతా విలువలు మరుగున పడిపోవటమే. ఈనాడు కేవలం మానవ ఆకారాలుగా ఉన్నారుగాని మానవగుణములు ఏమాత్రం రాణించటంలేదు.

### లోకాస్సమస్తాః సుఖినోభవంతు

ఆనాడు ఋషులు, మహర్షులు, రాజర్షులు, బ్రహ్మర్షులు ఇలాంటి వారినే అనగా ఎట్టి ఆశలు లేకుండా స్వార్థప్రయోజనములు త్యజించిన మహర్షులనే మహారాజులు సలహాదారులుగా నియమించుకున్నారు. దశరథ మహారాజు తన కుమారుడైన రామచంద్రునకు పట్టాభిషేకము కట్టవలెనన్న కూడను వసిష్ఠ మహర్షి అనుమతిని కోరాడు. ఏకార్యము చేయవలసి వచ్చినప్పటికి మహర్షుల సలహాను పొందటానికి వారు సంసిద్ధులై ఉండేవారు. కారణమేమనగా ఆ మహర్షులకు స్వార్థము, స్వప్రయోజనము ఏమాత్రము లేదు. లోక కళ్యాణమే వారి దృష్టి. 'లోకాస్సమస్తా స్సుఖినోభవంతు' అన్నదే వారి ఆశయము. అలాంటి మహర్షుల ఆశ్రయాన్ని పొందటంచేతనే రాజుల పరిపాలనలోపల దేశము సుభిక్షము అభివృద్ధిగాంచుతూ వచ్చింది. ఆ మహర్షుల దగ్గర మంత్రశక్తులనేవి, మంత్రాయుధములనేవి అమితంగా ఉంటుండేవి. ఆ ఆయుధములను వారు జగత్స్వరూపమైనదాంట్లో వినియోగ పెట్టకూడదు.

ఈ యుద్ధములలో రెండు రకములైన యుద్ధములున్నాయి. స్వార్థము నిమిత్తము యుద్ధము చేయుటం ఒకటి. పరార్థము నిమిత్తము యుద్ధము చేయటము మరొకటి. విద్యలయందు రెండు రకములైన విద్యలుంటున్నాయి. లోకకళ్యాణ నిమిత్తము లోకోపకారం నిమిత్తమై ఆచరించే సత్యవ్రతములు. లోక అపకారం నిమిత్తమై ఆచరించే స్వార్థవ్రతములు, స్వార్థం నిమిత్తమై, స్వప్రయోజనము నిమిత్తమై ఆచరించే విద్యలంతా రాక్షస విద్యలన్నారు. లోకక్షేమ నిమిత్తము ఆచరించే చదివే విద్యలన్నీ బ్రహ్మవిద్యలు అన్నారు. ఇటువంటి బ్రహ్మవిద్యలు నేర్చినవారు ఆనాటి ఋషులు. వారికి మంత్రశక్తి అధికంగా ఉండేది. ఈనాడు స్వార్థపరమైన విద్యలందు యంత్రశక్తి అధికంగా ఉంటుండాది. యంత్రశక్తికి కొంతమాత్రమే పరిమితము ఉంటుండాది. మంత్రశక్తికి ఇంత అంత అని చెప్పటానికి వీలుకాదు. దానికి ఎంతైనా పవర్ రావచ్చు. యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ దీనికి మనస్సుతో చెప్పటానికి గాని,

srisathyasaivachanamrutam

వాక్కుతో వర్ణించటానికి గాని సాధ్యము కానంత శక్తి ఉంటుండాది.

సత్యవ్రతులైన మహనీయుల దగ్గర ఉండిన ఆయుధములను లోకాద్ధరణ నిమిత్తమై అవతరించిన పురుషులకు మాత్రమే అందించాలి అనేది వారినియమం. విశ్వామిత్రుడు దశరథ మహారాజు దగ్గరకు వచ్చి రామలక్ష్మణులను యాగసంరక్షణం నిమిత్తమై పిలుచుకొని పోవటానికి కారణమిదియే. ధర్మ సంస్థాపన నిమిత్తమై అతరించిన మహాపురుషులకు మాత్రమే ఈ ఆయుధములు అందించాలని తన దగ్గరనున్న సర్వాయుధములను రామునకందించాడు. తద్వారానే రాముడు దండకారణ్యములో అడ్డు తగిలిన రాక్షసులనందరినీ సంహరిస్తూ వచ్చాడు. అగస్త్య మహర్షి కూడను అంతే. అక్కడ కూడను అక్షయ రక్షణనంతా రామునకందించాడు. తద్వారానే రాక్షస సంహారం జరుగుతూ వచ్చింది. ఇంకా వీరికి విద్యలు నేర్పిన వారెవరు? మహా విద్యావంతుడు. విశ్వామిత్ర మహర్షి వీరికి చక్కని విద్యలు నేర్పుతూ వచ్చాడు. అర్జునునకు విద్యలు నేర్చినవారెవరు? సకల విద్యలు గావించిన ద్రోణా చార్యుడే ఇతనికి విద్యలు నేర్పాడు. అర్జునునకు గాండీవ మందించిన దెవరు? వ్యాస మహర్షి బోధలచేత తపస్సు చేసి ధనుస్సును సంపాదించుకున్నాడు. ఈ విధముగా వీరందరికి అనేక విధములై ఆధ్యాత్మిక విద్యలు మహర్షులు నేర్చిన తద్వారానే లోకములోపల ధర్మస్థాపన గావించటానికి వీలయింది. ఈనాడు ఎట్టి విద్యావంతుడైనప్పటికి స్వార్థము స్వప్రయోజనము ఉండినంత వరకు ఆవిద్య కేవలము నిరుపయోగమైనది. కనుకనే విద్యా తపోభ్యాం పూతాత్మ అన్నారు మహర్షులు. విద్యతోబాటు తపస్సు కూడను అత్యవసరము.

తపస్సనగా తలక్రిందకు కాళ్లుపైకి పెట్టి చేయటం తపస్సు కాదు. మనస్సు, వాక్కు, కాయము మూడింటియొక్క ఏకత్వాన్ని సంపాదించటమే. అదే త్రికరణశుద్ధి. ఈ త్రికరణశుద్ధితో భగవంతునికి అర్పితము గావించటమే తపస్సు. పరమాత్మ చింతచే పరమాత్మకు అర్పితము గావించే సర్వకర్మలు తపస్సులే. స్వార్థ స్వప్రయోజన నిమిత్తమై ఆచరించే సమస్త కర్మలు తమస్సులే. అది తపస్సు. ఇది తపస్సు. ఇది యంత్రశక్తి. ఇది యంత్రశక్తి. వీరంతా యంత్రోపాసకులు. వారంతా మంత్రోపాసకులు. మంత్రద్రష్టలైన మహర్షుల ప్రోత్సాహము చేతనే ఆనాడు జగత్కళ్యాణము జరుగుతూ వచ్చింది. ఈనాడు ఆధునిక విద్యలవల్ల ఇలాంటి

srisathyasaivachanamrutam

మహత్తరమైన శక్తిని అలక్ష్యం చేస్తూ వస్తున్నారు. కృత్రిమమైన విద్యలచేత మానవుడు కృత్రిమమైన రూపమునే ధరిస్తున్నాడు. విద్యలు కేవలము మన బ్రతుకు నిమిత్తము కాదు. జీవితాన్ని పోషించే నిమిత్తముకాదు. జీవితాన్ని బోధించే నిమిత్తము. ఈనాడు మనము విద్యనంతా మన జీవనోపాధికి ఉపయోగపెడుతున్నాము.

**జీవిత పరమావధి గుర్తించండి**

విద్యార్థులారా! జీవితము అవసరమే. జీవిత పరమావధిని కూడను లక్ష్యము నందుంచుకోవాలి. ఎంతమంది విద్యావంతులు జగత్తులో లేరు. ఎంతమంది ధనవంతులు జగత్తులో లేరు. ఎన్ని విధములైన హోదాలో ఉండేవారు జగత్తులో లేరు. ఇవి కాదు. దీనితోబాటు స్వార్థ స్వప్రయోజనములను త్యాగము చేసే మహత్త్వాన్ని కూడను మనము పొందాలి. రాత్రి నిద్రలోపల మహారాజు ఎన్నో కలలు కంటాడు. ఆ మహారాజు రాత్రి కలలో బిక్షగాడి రూపం పొందుతాడు. బిక్షగానికి ఒక కల వస్తుంది. ఆ స్వప్నములోపలవాడు రాజుగా మారుతాడు. బెగ్గర్ రాజుగా మారటము రాజు బెగ్గర్‌గా మారటము స్వప్నము ఉండినంతవరకు మాత్రమే. స్వప్నమునుండి మేలుకున్న తరువాత ఇద్దరికి సుఖము లేదు దుఃఖము లేదు. సుఖ దుఃఖములనేవి మోహమనే నిద్రలో ఉండినంత వరకే. మనలను బాధిస్తుంటాయి. కనుకనే వేదమునందు నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః అన్నారు. ఈ అమృతత్వమనేది ఏమిటి? జాగ్రత్ స్వప్న సుషుప్తులందు ఏకత్వాన్ని భావించేదే అమృతత్వం. అమృతమనగా ఒకరసము కాదు. ఆత్మజ్ఞానమే అమృతము. అదే అమరత్వము. ఇలాంటి అమృతత్వమైన అమరత్వాన్ని పొందాలనుకుంటే మనం అంతర్దృష్టిని అభివృద్ధి గావించుకోవాలి. అంతర్దృష్టి అభివృద్ధి పరచుకోవాలంటే మనకు భగవద్భావము రావాలి. భగవద్భావము చేత హృదయము కరగాలి. ఈ కరిగిన హృదయము ప్రేమరూపములో ప్రవహించాలి. ఈ ప్రేమ రూపమైన ప్రవాహమే పరమాత్మలో లీనమైపోతుంది.

విద్యార్థులారా! ప్రేమ మూడు విధములుగా ఉంటుందని మన విద్యార్థి చెప్పాడు. శరీర సంబంధమైన భౌతికప్రేమ, మానసిక సంబంధమైన ప్రేమ, ఆత్మ సంబంధమైన ప్రేమ అని. అయితే ఇక్కడ మూడు ప్రేమలు లేవు. మూడు కలిసి ఒక్కటే. మన భావములు మాత్రమే

srisathyasaivachanamrutam

మారిపోతున్నాయి. ప్రేమ ఒక్కటే. ఈ ప్రేమను భగవద్భావముతో అనుభవించినప్పుడు అన్ని సార్థకత నొందుతాయి. ప్రేమను స్వార్థభావముతో అనుభవించినప్పుడు ఇందులోనే కొన్ని సుఖదుఃఖములు సంభవిస్తాయి. కనుకనే సర్వకర్మ భగవత్ప్రీత్యర్థమనే దీనితో మనం అనుభవించాలి. స్థూల దేహము సూక్ష్మదేహము, కారణదేహము అన్నారు. సూక్ష్మ దేహము ఏరీతిగా ఉంటుండాది? స్థూల సూక్ష్మములు రెండును ట్విన్సు. సన్నిహిత సంబంధమైనవి. బింబప్రతిబింబములున్నట్లుగా ఉంటాయి. Action, reaction ఉండినట్లుగా, sound resound ఉండినట్లుగా ఉంటుంది. మనలో ఉండిన తత్త్వమంతా కూడను మనలోనే ఇమిడి ఉంటుంటాది. మనం ఎక్కడికోవెళ్ళి ఏదో మాట్లాడుతున్నాం. ఆ మాట్లాడిన resound మనకు వస్తుంటాది. ఈ echo అనేది సర్వత్ర ఉంటుండాది. కొన్ని కొన్ని స్థానములలో ప్రత్యక్షముగా రూపొందుతుంటాది. కొన్నికొన్ని స్థానములలో గుప్తంగా ఉంటుంది. సర్వత్రా ఉంటుండాది ఈ echo. స్వరూప లక్షణాన్ని బట్టి, గాలియొక్క వాతావరణమును బట్టి అక్కడ ఎక్కువగా రూపొందుతూ ఉంటుంది.

ఒక విద్యార్థి పశువులు తీసుకుని ఒక కొండవరకు వెళ్ళాడు. అక్కడకు పోయి ఏదో ఒక పాటను ప్రారంభించాడు. ఎక్కడనుండో అదేపాట తిరిగి వస్తుండాది. ఈ పిల్లవానికి ఉందని echo తెలియదు. ఎవడు వాడు నా స్వరముతోనే నాపాటనే పాడుతున్నాడని బాధపడ్డాడు. ఎవడురా నీవు? అని అడిగాడు. అక్కడ నుండి మళ్ళీ ఎవడురానీవు అని సౌండు వచ్చింది. ఏమిది? ఇంత అలక్ష్యంగా మాట్లాడుతున్నావని నీపేరు చెప్పమన్నాడు. తిరిగి నీపేరు చెప్పు అని వచ్చేసింది. ఏయ్ నోర్మూయ్ అన్నాడు. వాడు కూడను నోర్మూయ్ అన్నాడు. ఏయ్ నిన్ను పట్టుకొని కొడ్తానన్నాడు. వాడు కూడా నిన్ను పట్టుకొని కొడ్తానన్నాడు. ఈ విధంగా వాదోపవాదాలు అధికంగా జరిగిపోయినాయి. వీడెక్కడ ఉన్నాడో అన్నివైపుల వెతికాడు. ఎక్కడా కనుపించలేదు. వీడెవడో నా ఎనిమీగా ఉంటున్నాడు. నాకు చాలా విరుద్ధదంగా వీడు ప్రవర్తిస్తున్నాడు. వీడి పనిపట్టాలి అనుకున్నాడు. పశువులను తోలుకున్నాడు. ఇంటికి వచ్చాడు.

అమ్మతో చెప్పాడు. అమ్మా! ఎవరోనన్ను ఈవిధంగా చాలా తిట్టినాడు. నేనన్నట్లుగా వాడుకూడా అన్నాడు. మర్యాదలేకుండా వాడు అన్ని విధాలా అవమాన పరిచాడన్నాడు. తెలిసినది

sri sathyasai vachanamrutam

కనుకనే అమ్మా అప్పుడు చెప్పింది. నాన్నా! నిన్నెవ్వరు తిట్టలేదు. నిన్ను నీవే తిట్టుకున్నావు. ఈ ప్రపంచమంత కూడను భగవంతుని రిసౌండే. ఇది అంతాకూడను భగవంతునికి ప్రతిబింబమును నిరూపించే శుద్ధమైన అద్దము వంటిది. నీవు ఏవిధమైన చర్యలు చేస్తున్నావో అవే వాపస్ వస్తున్నాయి. నీవు ఏవిధమైన శబ్దాలు చేస్తున్నావో ఆ శబ్దములే నీకు వెనుకకు తిరిగి వస్తున్నాయి. కనుకనే ఎవరినీ నీవు దూషించవద్దు. ఎవరినీ నీవు నిందించవద్దు. ఎవరినీ నీవు బాధించవద్దు. లోకముకూడను సుఖసంతోషములందించి నిన్ను అభివృద్ధికి తెస్తుంది. మంచి చెడ్డలు నీయొక్క భావములే తప్ప అన్యములు కావు. Reflection of the inner being. ప్రతి ఒక్కటీ నీనుండి వచ్చినవే. Reaction, reflection resound.

ఈ సత్యమును విద్యార్థులు గుర్తించి Be good, do good, see good. This is the way to God. విద్యార్థులయందుగాని, సామాన్యమైన వ్యక్తులయందుగాని మనము ఒకవిధమైన పలుకునుగాని, దృష్టినిగాని, శ్రవణమును గాని చెడ్డదిగా భావించరాదు. మొట్టమొదట మన చదువులతోబాటు వివేక విజ్ఞానములు కూడను పోషించుకోవాలి. ఈనాడు విజ్ఞానమును మనము అభివృద్ధి పరచుకుంటున్నామేగాని ఆ విజ్ఞానమునకు తగిన వివేకము మనలో లేదు. వివేకము లేని విజ్ఞానము చాలా ప్రమాదము. అణుశక్తితో మనం ఎన్నో సృష్టిస్తున్నాం. తద్వారా ఎన్నో కోట్ల యూనిట్ల కరెంటు వేస్టు చేస్తున్నాం. తద్వారా బాంబులు చేసి జగత్తుకు అపకారమైన యంత్రములు కనిపెడుతున్నాం. అదే విజ్ఞానమును వివేక మార్గములో విచారణ చేసి ఉత్పత్తి స్థానములో ప్రవేశపెడితే ఎన్ని పంటలు పండించుకోవచ్చు. ప్రజలకనుకూలమైన వస్తువులు ఎన్ని సృష్టించుకోవచ్చును. జగత్తుకు ఉపకార సంబంధమైన కార్యములలో మనము ఈ విజ్ఞానమును ప్రవేశపెట్టాలి కాని జగత్తుకు అపకారం గావించేదానిలో ప్రవేశపెట్టరాదు.

విశ్వామిత్ర, వశిష్ట, జమదగ్ని మహర్షుల వద్ద అనేక శక్తులతో కూడిన మంత్రాలున్నాయి. కాని వారంతా వివేకముతో వాటిని సద్వినియోగపరచుకున్నారు. కనుకనే ఋషిశక్తే జ్ఞానము. ఈనాటి గ్రంథశక్తియే ఒక విద్య. మీరు విద్యావంతులు కావచ్చుగాని జ్ఞానులుకారు. ఇంద్రియములను నిగ్రహించుకునే విద్యావంతుడే జ్ఞాని. ఇంద్రియములను ఇష్టము వచ్చినట్టుగా

srisathyasaivachanamrutam

ప్రవేశపెట్టే విద్యావంతుడు జ్ఞానికాడు. విద్యావంతుడు మాత్రమే. ఇది కేవలము Bookish knowledge. ఈ నాలెడ్జి ఈ తెలివితేటలు, ఈ మేధాశక్తి ఎంతకాలమో ఉండదు. విద్యార్థులారా! మీరు పరీక్షల నిమిత్తమే అభ్యసించే పఠనమంతా పరీక్షలైన తరువాత విచారణ చేసుకోండి. ఏమాత్రం జ్ఞాపకము ఉండదు. పరీక్షలైన తరువాత మీ చదువులంతా మీకు జ్ఞాపకం లేకపోతే మీ విద్యాశక్తులన్నీ కొంతకాలము లోపల ఆవిరిగా మారిపోతాయి.

**మన భావమువల వల్లనే మంచి చెడ్డలు**

మంచికిగాని చెడ్డకుగాని మన భావములే మూలకారణము. ఇక్కడ నుండి మేఘములు ఎక్కడికో తీసుకొని పోవటము ఎక్కడున్న మేఘములనో ఇక్కడకు తీసుకొని రావటానికి కారణము ఏమిటి? గాలియే కారణము. అట్లే మీయందున్న దుర్భావములను పంపటానికిగాని, ఎక్కడనో ఉన్న సద్భావములను తెప్పించుకోటానికిగాని నీమనో భావములే మూలకారణము. కనుకనే వేదము బోధించినది. ఇష్టాన్ని ఫలింపచేయటము అయిష్టాన్ని దూరముగావించటము. ఇలాంటి పవిత్రమైన శాస్త్ర సమ్మతమైన మార్గాన్ని అనుసరించినవారే మహనీయులు. ఇది కేవలము ఒక భారతదేశమునకే ఉండవచ్చును. విదేశాల్లో ఎట్ల ఉంటాది? వారికి ఈ విధమైన శాస్త్రములు ఈ విధమైన పఠనము లేవు కదా. అని మీరు సందేహించవచ్చును. దేశం ఒక దేహము వంటిది. ఈ దేహమునకు అనేక రోగములు రావచ్చును. అయితే ఒక దేహమునకు వచ్చిన రోగమే మరొక దేహమునకు వస్తుందని చెప్పటానికి వీలులేదు. ఆయా దేశములలో ఉండిన సిద్ధాంతముల ననుసరించి వారుకూడను దాన్ని అనుసరిస్తూ పోతుంటారు. ఈ దేశమునకు సంబంధించిన సిద్ధాంతములు ఈ దేశమువి. ఆ దేశమునకు సంబంధించిన సిద్ధాంతములు ఆదేశము వారు అనుసరిస్తూ ఉంటారు. వారు ఈ సిద్ధాంతములను అనుసరించకుండా పోతే వారుకూడ ఈ అవస్థలకు గురౌపోతారు. ఇద్దరికీ ఒకే సిద్ధాంతమని ఎప్పుడూ ఉండదు.

కడుపునొప్పిని నలుగురు పేషంట్లు డాక్టరు దగ్గరకి వచ్చారు. నలుగురికి కడుపునొప్పి సమానమేగాని డాక్టరు నలుగురికి నాలుగు రకములైన ట్రీట్‌మెంట్లు ఇస్తాడు. ఒకరిని పరీక్ష చేస్తాడు. నాయనా! నీ కడుపునొప్పికి ఏమీ కారణం లేదు. కేవలం గ్యాస్ మాత్రమే ఉంటుండాది సోడా బైకార్బ మాగ్సల్సు రెండు కలుపుకొని తాగెసెయ్యి. నీకడుపునొప్పి పోతుంది అన్నాడు.

sri sathyasai vachanamrutam

కడుపు నొప్పితో వచ్చిన ఇంకొకనికి చెప్తాడు నాయనా ఏమీ తొందరలేదు. హాట్ వాటర్ ఫోమెంటేషన్ చేసుకో సరిపోతుంది అంటాడు. ఇంకో కడుపునొప్పివాడు వచ్చేసినాడు. నీకేం లేదు ఇంత సాల్ట్ వేసుకో అంటాడు. రెండుతూర్లు భేదులయితే పోతుంది అంటాడు. ఇంకో కడుపునొప్పివానికి immediateగా ఆపరేషన్ చేయాలంటాడు. వానికి అపెండిసైటిస్ ఆపరేషన్ చేసేతీరాలి. నలుగురికి కడుపునొప్పి ఒకటే కదా ట్రీట్‌మెంటు లెందుకు వత్యాసంగా ఉన్నాయి.

అదే రీతిగా అనేక దేశములలో అనేకవిధములుగ ఈ నొప్పులు ఉండవచ్చు. బాధలు కలుగవచ్చును. ఆయా దేశాలకు తగిన ట్రీట్‌మెంటు ఉంటుంది. మనకు బాహ్యంగా రోగం ఒకటిగా కనిపించినప్పటికి అంతర్ముఖములో రోగభావం వేరువేరుగా ఉంటాయి. మందులు కూడా వేరువేరుగా ఉంటాయి. మన భారతదేశమునకు సంబంధించిన ఈ రోగమునకు ఇదే మందు. విద్య లభ్యసించినంతమాత్రమున వీరులముకాము. మహనీయులము కాము. అధికారులము కాము. నిజముగా విద్యవిజ్ఞానము కోసం కృషి కూటికోసం. కేవలం విద్యతో కూటిని పొందటానికి నీకు వీలుకాదు. కలిమహత్యం చేత ఈనాడంతా కడుపునిమిత్తమే బాధపడుతున్నారు.

**మనస్సును నిర్మలంగా ఉంచుకోండి**

విద్యార్థులారా! కడుపునిండినంత మాత్రమున మనకు తృప్తికాదు. మన సోదరులైన ప్రజలు ఎంతమందో ఉంటున్నారు. వాళ్ల కడుపుకూడ నిండటానికి కృషి చెయ్యాలి. వ్యక్తిగా సమాజంలో ప్రవేశించండి. ఈ సమాజం నుంచి దేశంలో ప్రవేశించండి. నీవు వ్యక్తిగానే ఉండకూడదు. పశుత్వంగా ఉండే మానవుడు దివ్యత్వంగా మారాలంటే మనస్సు మార్పులు అత్యంత అవసరము. మనస్సు మారినప్పుడే మనిషి మారగలడు. కేవలం మనిషి మారినంత మాత్రమున ప్రయోజనం లేదు. మనస్సును మార్చుకోవాలి. విద్యవల్ల మనం సాధించవలసిన ప్రధానమైన ఘనత అదే. ఏదో ఊరకే డిగ్రీలు పెట్టుకుంటూ పోవటం కాదు. ఈ డిగ్రీలంతా మనస్సుకు సంబంధించిన దివ్యమైన భావంగా ప్రవేశపెట్టాలి. అదే పొందవలసిన డిగ్రీ. ఏమిటంటే శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః నాయనా నీవు అమృత పుత్రుడివి అనే బిరుదును పొందాలి. అదే మనం సాధించవలసిన డిగ్రీ. ఈ డిగ్రీలంతా మనకెందుకు? అయితే ఈ

డిగ్రీలు కూడా ఉండవలసిందే. దీనితోబాటు దానిని కూడను జోడించుకోవాలి. మనం దురాశలకు గురికాకూడదు. ధనమును సంపాదించవలసిందే. ధర్మముతో వినియోగించవలసిందే. దానము చేయవలసిందే. ధన్యత కలుగవలసిందే. అయితే ఒక విధమైన లిమిట్ పెట్టుకోవాలి. ఒక పరిమితి ఉంటుండాలి.

విద్యార్థులారా! మీకనేక పర్యాయములు చెప్పాను. ఈ ధనమనేది కాలి shoe వంటిది. పూజించే ధనాన్ని కాలి చెప్పులంటున్నాడే సాయిబాబా అనొచ్చును. అది నిజంగా అంతే. అది బూట్సులే. మనకాలికి కరెక్టుసైజుగా వచ్చినప్పుడే మనం చక్కగా నడచగలం. అది టైట్ అయితే నడవలేము. అది లూజ్ అయితే కూడను నడవలేము. మనకు ధనము వచ్చినా మనము సరియైన స్థితిని పొందలేము. ధనము తక్కువగా ఉంటుంటేను సుఖశాంతులను పొందలేము. అవసరమైనంత ధనము కావాలి. మనకు అధికంగా కోరరాదు. ఆ చిత్రాన్ని మీ హృదయంలో హత్తుకొనేటట్లుగా చూసుకోండి. సంపాదించండి సంపాదించినదానిని సద్వినియోగం చేయండి.

**విద్యయొసగును వినయంబు**
**వినయము వలన కల్గు పాత్రత**
**పాత్రతవలన ధనము ధనము వలనను ధర్మంబు**
**దాని వలన ఐహికాముష్మికంబు బొందునరుడు**

purity కావాలంటే charity చేయాలి. Charity వలననే purity. Purity వలననే Unity. Unity లేకపోతే enimity అయిపోతుంది. ఈ unity వలననే divinity కనుక మనం charity నుండి divinityకి రావాలి. త్యాగమువల్లనే అమృతత్వము మనకు ప్రాప్తిస్తూ వచ్చింది. ఇక్కడ సమాజసేవను అధికంగా చేసుకోవాలి. తోటి మానవులతో సరియైన జీవితము మనము గడపాలి. విశాలమైన హృదయంగా మార్చుకోవాలంటే మనలో దివ్యభావాలు పెంపొందింపచేసుకోవాలి. హృదయం కరిగిన మాధుర్యమనే ప్రేమను మనం అనుభవించాలి. అది లేకపోతే కృత్రిమమైన జీవితమే. కనుక ప్రేమను పెంచుకోండి. జీవితాన్ని ప్రేమమయంగా మార్చుకోండి.

**(తేది. 02-07-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam